క్లుప్తంగా

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం


భక్తులను ఆకట్టుకున్న కోలాటం

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె సమీపంలో వెలసిన మునీశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయానికి భక్తులు చేరుకునేందుకు వాసవి ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంటు జనార్ధన్ గుప్త ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకూరు గ్రామానికి చెందిన కోలాట బృందం భక్తులను ఆకట్టుకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పరామర్శ


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ మాజీ షాదీఖానా కమిటీ చైర్మన్ బి.ఎస్.షేక్షావలి తండ్రి మైనార్టీ నేత హాజీ బి.ఎస్.జాఫర్ సాహెబ్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి షేక్షావలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో..

వేముల : వేములకు చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు వల్లెపు నాగేష్ కుమారుడి వివాహం స్థానిక మంజునాథేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగింది. ఈ వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆ పార్టీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఆ పార్టీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులైన హరికృష్ణ, శిరీషలను ఆశీర్వదించారు. అలాగే మండలంలోని ఎంపీటీసీలు, పలు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వివాహ వేడుకలో పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

వేంపల్లె : ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. శుక్రవారం విజయవాడలో వైద్య, విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ జిల్లా కార్యదర్శి హరినారాయణతో కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

మేడేను విజయవంతం చేయాలి


గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు

వేంపల్లె: కార్మిక దినోత్సవమైన మే డేను కార్మికులందరూ హాజరై విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆయన కార్మిక దినోత్సవ గోడపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయన్నారు. నూతన హక్కుల సాధన, వ్యవస్థలు, పాలకులు మారుతుంటే కార్మికుల హక్కులు, సంక్షేమ చట్టాలు మరిన్ని అమలు కావాల్సి ఉండగా దానికి విరుద్ధంగా నేడు పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

తాళం ఏర్పాటు


పోలీస్‌స్టేషన్‌లో తలుపునకు వేసిన తాళం

పులివెందుల రూరల్ : పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఖైదీలకు వేయాల్సిన బేడీలను తలుపులకు వేయడంతో సాక్షి దినపత్రికలో ‘పులివెందుల పోలీసుల రూటే సపరేటు’ అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసు అధికారులకు తలుపులకు వేసిన బేడీలను తీసి తాళాలు వేశారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు


కమలాపురం : సీఎస్ఐ చర్చీ ఆధ్వర్యంలో శిలువ మోస్తున్న యువకుడు

పులివెందుల టౌన్ : స్థానిక సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఫాదర్ ఆనందబాబు యేసు క్రీస్తు గురించి వివరిస్తూ ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, రాక్‌చర్చి, బేతేలు చర్చి, సాలేము ప్రార్థనా మందిరం, క్యాథలిక్, హోసన్న తదితర ప్రార్థన మందిరాల్లో క్రైస్తవు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పట్టణంలోని రోమన్ క్యాథలిక్ చర్చి ఫాదర్ ఆరోగ్యస్వామి ఆధ్వర్యంలో శిలువయాగం గాంధీసర్కిల్, కచేరిరోడ్డు, పాతగంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముద్దనూరురోడ్డు మీదుగా శిలువయాగాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప తన తండ్రి ఓబన్న జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి, కౌన్సిలర్ కోడిరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్, షమీవుల్లా, వీరారెడ్డి, నాగరాజు, రామకృష్ణ,క్రైస్తవ సోదరులు పాల్గొని విజయవంతం చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని కమలాపురం, పెద్దచెప్పలి, రామచంద్రాపురం, చదిపిరాళ్ల, సంబటూరు, కోగటం, గంగవరం, విభరాపురం తదితర గ్రామాలలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించుకున్నారు. పట్టణంలో వెలసిన చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించుకున్నారు. సీఎస్ఐ చర్చి ఫాస్టర్ రెవ. యు. సాల్మన్ రాజు ఆధ్వర్యంలో యువకులు క్రీస్తు శిలువ యాగం చేశారు. స్థానిక రైల్వే గేటు వద్ద నుంచి సీఎస్ఐ చర్చి వరకు శిలువ యాగం సాగింది. అలాగే ఆర్‌సీఎం చర్చీ సంఘ సభ్యులు, సంఘ పెద్దల ఆధ్వర్యంలో క్రాస్ రోడ్డు నుంచి ఆర్‌సీఎం చర్చీ వరకు శిలువ యాగం చేశారు.

వల్లూరులో..

వల్లూరు : పైడికాలువలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రవీంద్ర ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా సాగిన ఈ గ్రామోత్సవం చర్చి వరకు సాగింది. చర్చి ఆవరణలో శిలువను నాటి ప్రార్థనలు చేశారు. అనంతరం దివ్య బలి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లూరు, పాపఘ్నినగర్, గణేష్‌పురం, లేబాక, బాలుగారిపల్లె, కుముద్‌బెన్ జోషి నగర్, కుమారునిపల్లె తదితర గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 49 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలను విరమించారు. కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, యువకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని అన్ని చర్చిలలో, ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ మత బోధకులు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రైస్తవ భక్తులు ప్రార్థనలో పాల్గొని వేడుకులను నిర్వహించారు.

జమ్మలమడుగులో


జమ్మలమడుగులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జమ్మలమడుగు : పట్టణంలోని టౌన్ చర్చిలో సీఎస్ఐ పాస్టర్ ధామస్‌బాబు, జోసఫ్‌బాబులు ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు వ్యాక్త సందేశం వినిపించారు. ఆర్‌సీఎం చర్చి, ఎస్పీజీ క్వార్టర్‌లో ఉన్న సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక బిడాలమిట్ట కల్వరీకొండ చర్చిలో ఫాస్టర్ ఎస్.బి.రవి కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి నుండి బిడాలమిట్టలో ఉన్న కల్వరీకొండ చర్చి వరకు శిలువ యాగం కార్యక్రమం సాగించారు. వేంపల్లెలోని పులివెందుల, కడప రోడ్డులో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు.

లింగాలలో..

లింగాల : మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగాల, పెద్దకుడాల, పార్నపల్లె, అక్కులగారిపల్లె, ఇప్పట్ల, కోమన్నూతల తదితర గ్రామాల్లో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్లు ఏసుక్రీస్తు మరణం, గుడ్ ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు.


పులివెందులలో శిలువ యాగంలో రోమన్ క్యాథలిక్ ఫాదర్ ఆరోగ్యస్వామి, క్రైస్తవ సోదరులు


వల్లూరు : గ్రామోత్సవంలో శిలువను మోస్తున్న విశ్వాసులు


వేంపల్లెలో శిలువ యాగ కార్యక్రమంలో క్రిష్టియన్లు


లింగాల బేతేలు చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, క్యాన్సర్ స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. నరాలు, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇ-వేస్ట్ నిర్మూలనకు సహకరించండి

కమలాపురం : పట్టణ ప్రజలు ఇ-వేస్ట్ నిర్మూలనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3వ శనివారం అనగా 19వ తేదీన ఇ-వేస్ట్ నిర్మూలనకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇ-వేస్ట్ అనగా పాత బల్బులు, రిమోట్, బ్యాటరీస్, కంప్యూటర్, మొబైల్ ఫోన్ తదితర వాటిని శనివారం మీ ఇంటి వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలన్నారు. ఇ-వేస్ట్‌ను ప్రత్యేక శాస్త్రీయమైన పద్ధతిలో కంపోస్ట్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయం నుంచి వచ్చే ఇ-వేస్ట్‌ను సేకరించడానికి ప్రత్యేక మున్సిపల్ వాహనంను ఏర్పాటు చేశామని, అధికారులందరూ ఇ-వేస్ట్‌ను ఆ వాహనంలో అందజేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేయడం తగదు


విలేకరులతో మాట్లాడుతున్న మునీర్‌బాషా

వేంపల్లె : వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఓట్లు వేసిందని, టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా 95 ఓట్లు వేస్తే... అందులో 7 ఓట్లు వైఎస్సార్‌సీపీ వేసినట్లు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఓటు వేసినట్లు నిరూపిస్తామన్నారు. చంద్రబాబు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఏ విధంగా వైఎస్సార్‌సీపీ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిందో టీడీపీ నాయకులు నిరూపించాలని సవాల్ విసిరారు. టీడీపీ ఓపెన్‌గా వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చిందని చెప్పడం గర్హనీయమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుండి వైఎస్ జగన్ వరకు ముస్లింలకు న్యాయం చేసింది వైఎస్సార్‌సీపీనే అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సుప్రీం తీర్పు ముస్లింలకు అనుకూలంగా, సానుకూలంగా రావడానికి కూడా వైఎస్సార్‌సీపీనే ముఖ్య కారణమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు బాబా షరీఫ్, షామీర్, మండల కోఆప్షన్ మెంబర్ అసనయ్య, ఎంపీటీసీ రహంతుల్లాఖాన్, మటన్‌బాబా, సేవాదళ్ అధ్యక్షుడు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న ఎస్ఐ

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న నారాయణ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తూ.. వారికి అనుకూలంగా స్టేషన్‌కు వచ్చిన పంచాయతీలను చేస్తున్నారని జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్ఐ నారాయణ అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు పంచాయతీలు చేస్తున్నారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వస్తే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. సాయి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, అతన్ని చూడ్డానికి వచ్చిన పవన్ అనే వ్యక్తిపై గతంలో కేసు ఉందని స్టేషన్‌కు పిలిపించుకుని 41 నోటీసు ఇవ్వకుండా ఘర్షణకు దిగారన్నారు. దీంతో జై హిందుస్థాన్ పార్టీ ఆధ్వర్యంలో స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి విరమించడం జరిగిందన్నారు. 41ఏ నోటీసు పంపించాల్సిన కేసులో కూడా ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఎస్ఐ నారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎస్ఐని సస్పెండ్ చేయకపోతే పోలీస్‌స్టేషన్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు.

ఆకస్మిక తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్

కమలాపురం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ పర్యవేక్షణలో ఎస్ఐ విద్యాసాగర్ సిబ్బందితో కలసి క్రాస్ రోడ్డులోని పలు అనుమానిత ప్రాంతాల్లో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా నేరాలను, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడంలో భాగంగా రిజిస్ట్రేషన్‌లేని, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీ చేశారు. అలాగే అనుమానిత ప్రదేశాలను, లాడ్జీలను, హోటళ్లను, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. నేరాలను అదుపు చేయడంతో పాటు దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం


మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

పులివెందుల రూరల్ : నియమ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను కొంతవరకైనా అరికట్టవచ్చునని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో చాలా మంది యువకులు కార్లు, ద్విచక్ర వాహనాలను వేగంగా నడపడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిడివిల్ల గ్రామ సమీపంలో యువకులు అతి వేగంగా కారు నడపడంవల్లే ప్రమాదం జరిగి మృత్యువాత పడటం జరిగిందన్నారు. అలాగే చాలామంది యువకులు లైసెన్సులు లేకుండా, రికార్డులు లేకుండా, డ్రైవింగ్ రాక ఉన్నప్పటికీ కార్లు, వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా గమనించి చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. యువకులు ప్రస్తుత కాలంలో మద్యం సేవిస్తూ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. అలా వాహనాలను నడపడంవల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ అధికారులు చెప్పే నియమ నిబంధనలను పాటించాలన్నారు.

అకాల వర్షాలతో రైతులకు తీరని నష్టం

- గాలివానతో నేలవాలిన అరటి తోటలు
- లక్షలాది రూపాయలు నష్టపోతున్న రైతులు


గాలివానకు నేలకొరిగిన అరటి పంట


గొందిపల్లె వద్ద పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు


వి.కొత్తపల్లె సమీపం ప్రధాన రహదారిలో విరిగిన పడి చెట్లు

వేముల : అకాల వర్షాలకు రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. అనుకోని సమయంలో గాలివాన భీభత్సం సృష్టించడంతో అరటి తోటలు నేలకూలుతున్నాయి. మండలంలో శుక్రవారం సాయంత్రం గాలివానతో భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీచడంతో గెలలతో ఉన్న అరటి చెట్లు నేలకొరిగాయి. ఈ గాలివాన భీభత్సానికి లక్షలాది రూపాయలు రైతులు నష్టపోతున్నారు. వేముల సమీపంలోని చెరువు కట్ట వద్ద వెంకటేష్‌కు చెందిన 5 ఎకరాలలో అరటి సాగు చేశాడు. 30 టన్నుల అరటి కాయలను అమ్మి వేశాడు. శుక్రవారం సాయంత్రం గాలివానతో 3 వేలకుపైగా అరటి చెట్లు పడిపోయాయని రైతు వాపోయాడు. అలాగే వేములకు చెందిన నారుబోయిన చిన్న గంగయ్య 3 ఎకరాలలో అరటి తోట సాగు చేశాడు. అరటి గెలలు నాలుగైదు రోజుల్లో కొట్టే సమయంలో గాలివానతో సుమారు 500 చెట్లకుపైనే నేలకొరగడంతో రైతు లబోదిబోమంటున్నాడు. పడిపోయిన అరటి గెలలను వ్యాపారస్తులు కొనకపోవడంతో రైతు నష్టపోవాల్సి వస్తోంది. అలాగే పులివెందుల-కడప ప్ర ధాన రహదారిలోని వి.కొత్తపల్లె వద్ద రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. అలాగే వేల్పుల సమీపంలో రోడ్డుకిరువైపులా చెట్లు విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వి.కొత్తపల్లె వద్ద చెట్లు పడటంతో వాహనాలను మళ్లించారు. భారీ వర్షానికి పత్తి తోటలలో వర్షపు నీరు నిలిచింది.

హడావుడిగా మండల మీట్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీ

ముద్దనూరు : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం అధికారులు హడావుడిగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. మండల అధికారుల తీరుకు, అధికారులు అభివృద్ధి పనులు, నిధులు సమాచారాన్ని తమను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ నేపథ్యంలో గుడ్ ఫ్రైడే పర్వదినం సెలవుగా పరిగణించినా అధికారులు హడావుడిగా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు కూడా హాజరు కాలేదు. కోరం లేకపోవడంతో గురువారం వాయిదా పడిన మండల సర్వసభ్య సమావేశాన్ని సెలవు దినం రోజు అయిన శుక్రవారం నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జోరుగా డీజిల్ దొంగతనాలు


రాత్రి సమయంలో లారీ నుంచి డీజిల్‌ను అపహరిస్తున్న దొంగ

పులివెందుల రూరల్ : ఈ మధ్యకాలంలో డీజిల్ దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని లారీ డ్రైవర్లు, యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల-కదిరి రోడ్డులో చిలంకూరు, ఎర్రగుంట్ల ప్రాంతాలలో సిమెంట్ లోడింగ్ కోసం పెట్రోల్ బంకుల పక్కన లారీలను ఉంచుతారు. ఇదే అదునుగా భావించిన డీజిల్ దొంగలు లారీలోనుంచి సుమారు 250 లీటర్లు నుంచి 1000 లీటర్ల వరకు డీజిల్ అపహరించినట్లు లారీల యజమానులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా డ్రైవింగ్ చేసి రాత్రి సమయాలలో పెట్రోల్ బంకు వద్ద లారీలు ఉంచి డ్రైవర్లు నిద్ర పోతున్న సమయంలో దొంగలు డీజిల్‌ను అపహరించి తీసుకెళుతున్నట్లు వారు వాపోతున్నారు. పోలీసు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్ల, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేయకపోవడంవల్ల డీజిల్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డీజిల్ దొంగతనాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సమీపంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గంగాధర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన గంగాధర్‌రెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం పులివెందులకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళుతుండగా పులివెందుల నుంచి జమ్మలమడుగు వైపు వెళుతున్న ఆటో ఢీ కొంది. చికిత్స నిమిత్తం 108లో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి


కమలాపురం సబ్‌జైల్ పెట్రోల్ బంక్ వద్ద డెమో చేసి చూపిస్తున్న ఫైర్ సిబ్బంది

కమలాపురం : ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం స్థానిక సబ్‌జైలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌తో పాటు స్థానిక వినాయక డికార్డికేటర్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులను డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా మంటలు వ్యాపించగా తక్షణం 101కు డయల్ చేయాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అందుబాటులో ఉన్న నీటిని గాని, ఇసుకను గాని ఉపయోగించి మంటలను అదుపు చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్ని మాపక శాఖ అధికారి సునీల్‌కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పార్నపల్లె రింగ్ రోడ్డులో ఉన్న అమరావతి ఫిల్లింగ్ స్టేషన్, కడప రోడ్డులోని పాల కేంద్రం వద్ద ఉన్న హరిప్రియ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన కలిస్తూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వాటి ఉపయోగాలు గురించి డెమో ద్వారా చూపించారు. ఇళ్లల్లో మహిళలు కూడా గ్యాస్‌పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా గ్యాస్ ఉన్న గదులలో తలుపులు తెరిచే ఉంచాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్ గోడౌన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి బి.శివరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లిలోని అగ్నిమాపక కేంద్రం పరిధిలోని గ్యాస్ ఏజెన్సీ గోడన్, పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఏజెన్సీ సిబ్బందికి అవగాహన కల్పించారు. గోడౌన్ల వద్ద అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అగ్నిమాపక యంత్రాలను, పనిముట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక శాఖ అధికారి సునీల్‌కుమార్


వేంపల్లెలో అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక శాఖాధికారి శివరామిరెడ్డి